# ముష్టివాళ్ళు

పొరపోయి దగ్గు రాసాగింది. నెక్ "టై" ముడి లూజ్ చేసి కొన్నాను.

"అరే మీకు అలవాటు లేనట్లుంది...సోడాలో కలుపుకోండి"

మళ్ళీ కొన్ని అంగుళాల కొలతకు పోశాడు. అంతవరకూ గ్లాసు నారింజ రంగులో కనబడింది. దాంట్లో సోడా పోశాడు. పల్చబడి పోయింది రంగు నురగలు గక్కుతూ.

"ఒక్కసారే అలా తాగెయ్యకండి ఇలా సిప్ చెయ్యాలి" అతను సోడా కలుపుకోలేదు. గ్లాసులో సగంవరకూ వంచుకొని పెదవులకు తగిలించాడు. అతని కళ్ళు ఉబ్బి ప్రకాశింపసాగాయి. మళ్ళీ ఇంకొక సోడా కలిపాడు నా గ్లాసులో,

"హౌ ఆర్ యూ ఫీలింగ్, 'ఆల్‌రైట్'. ఐతే ఇంకొక పెగ్ బిగించండి. ఏం ఆర్డర్ చెయ్యమంటారు" అతనన్నాడు బల్లమీద కార్డులోకి తొంగిచూస్తూ.

నాకు తల దిమ్మెక్కిపోయి శరీరమంతా తేలిపోసాగింది.

"మీ ఇష్టం"

వెయిటర్ మళ్ళీ వచ్చింది. ఆమె పూర్తిగా విదేశ స్త్రీ కాదు, కల్తీరకం. ఫారిన్ కొలోబరేషన్‌లో తయారయిన దేశీసరుకు. గట్టిగా శరీరానికి అంటుకుపోయిన గౌనులో శరీర అంగాల అనురూపత మనసునకు గాలం వేస్తోంది.

నడకలో ఆ నాజూకు. సున్నితత్వం విలాసం మన ఆడవాళ్ళకు లేవు. మగవాడ్ని చూస్తే పమిట సరిచేసికొని తుర్రున లోనికి పరుగెత్తే

మన మహిళలకున్న సిగ్గు - తత్తరపాటు - కనురెప్పలార్పటం ఆ పిల్లకు లేవు.

"చికెన్ చాప్స్, బిర్యాని" అత నన్నాడు నాకేసి చూస్తూ.

నేను తల ఊపాను ఆ యువతికేసి చూస్తూ.

"ఇంత అందంగా ఉన్నవాళ్ళను ఇక్కడ ఎందుకు వెయిటర్స్‌గా ఉంచుతారు." గ్లాసు ఖాళీచేసి అక్కడ పెట్టాను.

"ఇదే ఫస్టుటైమా బార్‌కు రావటం?" అతను నవ్వాడు.

అతను నవ్వాల్సిన అవసర మేముంది? ఏమీలేదు, కానీ నవ్వాడు. తృప్తిగా నవ్వుకొన్నాడు నాపంక చూస్తూ. నే తొడుక్కొన్న తొడుగులు, సైసూట్ నిగనిగ మెరుస్తున్న బూట్లు, వాటిల్లో గొంతువరకు మునిగిఉన్న నాలో కంట్రీఫెలో అతనికి కనిపించి ఉంటాడు.

నేను గ్లాసు పైకెత్తాను కోపంతో.

"ఇప్పటికే టూమచ్. ఇక మీరు త్రాగకండి" గ్లాసు అందుకున్నాడు.

అసంఖ్యాకమైన పింగాణీ సామాన్లు గ్లాసులు ట్రేతో తెచ్చి టేబుల్‌పై పేర్చింది. వెడల్పయిన లోతులేని ప్లేట్లు సాసర్లలో ఆరగించబడే కోళ్ళు ఇత్యాదులు. వాటిని చీల్చి నోట్లో కుక్కుకోటానికి కత్తులు కటారులు ఇతర పరికరాలు. ఆరగించబడే వస్తువులకన్న ఆరగించటానికుపకరించే వస్తువుల జాబితా పెద్దది.

ఆకలి...ఆకలి...ఉడకబెట్టిన కోడిగుడ్డుతో మొదలైంది విందు. ప్లేట్లన్నీ ఖాళీ ఐపోయ్యాయి. నీళ్ళలో పడిన మట్టపెళ్ళలా బ్రాందీలో కలిసిపోయ్యాయి కోళ్ళు కొక్కిరాయిలు. మంచినీళ్ళతో అంతమైంది విందు. అతనొక సిగరెట్ ముట్టించాడు నాకొకటి ఆఫర్ చేస్తూ.

"నో-నో ధ్యాంక్యూ"

ఆంగ్లో ఇండియన్ అమ్మాయి సున్నితంగా నడుస్తూ మళ్ళీ వచ్చింది. చిన్న సాసర్‌లో బిల్లు వడ్డించింది. నేను జేబులో చెయ్యిపెట్టి నోట్లు బయిటికి తీశాను.

'నో వో' అతను పెద్ద ప్రమాదం జరగబోతున్నట్లు అరిచాడు. ఆ బిల్లుమీద అతను పచ్చనోటు పెట్టాడు. అది నాకిష్టంలేదు. ఎందుకంటే అదొక "ఆబ్లిగేషన్" అవుతుంది-మొగమాట పెడుతుంది – ఎవడి ఉప్పు తింటే వాడిపట్ల విశ్వాసంగా ఉండాలని నీతిశాస్త్రం చెబుతుంది.

"ఉంచండి" అతని కోటు జేబులో నోట్లు పెట్టాను.

"మిమ్మలను ఆహ్వానించింది నేను. మరెందుకిలా" అతనన్నాడు ఆ నోట్లు మళ్ళీ నా జేబులో పెడ్తూ.

ఆమె మళ్ళీ సాసరు తెచ్చింది. అందులో చిల్లరక్రింద మారిన పచ్చనోటు. చిల్లర నాణాలక్రింద రెండురూపాయల నోటు కొన్ని పది రూపాయిలనోట్లు. పైన తిరుగుతున్న పంకా వాటిని రెపరెపలాడిస్తోంది. అతని చూపులు ఆ అమ్మాయిపైకి ప్రాకాయి. ఆ పిల్ల పెదవులపై మెలికలు తిరుగుతున్న చిరునవ్వు – ఉబ్బిన కనుగుడ్లలో ప్రవేశించి గుండెల్లోకి దిగిపోయింది.

పదిరూపాయల నోట్లు అతని జేబులోకి పోయ్యాయి. మిగతావి అతనివి కానట్లు నిర్లక్ష్యంగా వదిలేశాడు. ఆ జవ్వని కొద్దిగా మెడ ముందుకువంచి వినయంగా నమస్కరించింది.

'అవి' నేనటు చూశాను.

"టిప్-టిప్" అన్నాడు ఉలెన్ సూటు మడతలు సాఫ్‌చేసుకొంటూ అతను.

'అవన్నీ...' నా మాటలు కంఠంలోనే మిగిలిపొయ్యాయి. అద్దాలు అమర్చిన స్ప్రింగు తలుపు ముందుకు నెట్టాడు, మా వెనుక అది మూసి

కొనిపోయింది. ఒకదాని ప్రక్క మరొకటి చిన్నకార్లు వరసలో ఆగుతున్నాయి — ఎలుగుబంట్లులాంటి మనుషులు నీలంరంగు సూట్లు ధరించి లోనికొస్తున్నారు. పాము కుబుసంలాంటి చీరెల్లో కదుల్తూన్న ఆడవాళ్ళు ఎర్రరంగు పెదవులు తడుపుకొంటూ లోనికెళ్తున్నారు. పోర్టికోకి ఎదురుగా గేటు. దారి కిరుప్రక్కలా ఎత్తుపల్లాలుగా కత్తిరించిన గోడలాటి మొక్కలు. టాక్సీ ఒకటి పోర్టికోలో కొచ్చింది. మేం ప్రక్కకు తప్పుకున్నాం—భుజాలవరకూ కత్తిరించిన రవిక వేసికొన్న మహిళ దిగింది. రాత్రివేళ చల్లగాలికి బయటికొచ్చే ఎర్రతేలులా.

ప్రక్క ప్రక్కనే నడుస్తూ బయటిగేటు సమీపించాం.

"టాక్సీని పిలవనా" ఆతనన్నాడు.

"అక్కర్లేదు...ఇప్పుడేగా భోంచేసిందీ ... కొద్దిసేపు నడుద్దాం." గేటుబయట దీపపుచిమ్మె ప్రక్కనే బిచ్చగత్తె. రాగిరంగుతో వున్న జీబు తల. రక్తంలేక పాలిపోయిన ముఖం. చప్పిడిముక్కు. చెవుల్లో దూదివత్తులు. ఎండిపోయి పగుళ్ళు చూపిన నల్లని పెదవులు! రోడ్డుమీద కార్లు లేపిన దుమ్ము ఆమె కనుబొమలపై స్థావరం ఏర్పరచుకొంది. భుజంపై జోలెలా మరొక మురికిగుడ్డ నడుంవరకూ...అందులో నెలల పసికందు కంగారు పొట్టలో చిన్నపిల్లలా - దాని వీపుపైన ముసుగులో వాడి కాళ్ళు. ఒక ప్రక్కగా తొలగిపోయిన రవికక్రింద ఆ శిశువు తల-నీరుపట్టి లావుగా ఉన్నాయి దానికాళ్ళు. అనారోగ్యంగా ఉన్న పచ్చి బాలింత.

దాని చేతులో గుంటలుపడిన సత్తుగిన్నె అందులో నయాపైసలు గాలిలో కెగురవేసి శబ్దంచేసి నా దృష్టిని ఆకర్షించింది.

"దొరా...కట్టం చేసుకోలేను. ఒక నయాపైసా అయ్యా నీకు దణ్ణంబెడతా పాలులేని పసిపిల్లవాడు దొరా!...ఒక్క పైసా"

నా కళ్ళల్లో బలహీనత గ్రహించి నా దారి కడ్డంగా కదిలింది. వంగి నేలను స్పృశించింది యాతనపడుతూ - దాని నల్లని మురికిచెయ్యి చేతిలో సత్తుగిన్నె మా ప్రక్క ప్రక్కనే నడవసాగాయి.

"లెవ్వు పో" కసిగా అతని గొంతు.

అవును అతనివద్ద పైసలు లేవు - అతని దగ్గరున్నవి నోట్లు - రంగు రంగు నోట్లు - పచ్చనోట్లు కట్టలు.

జేబులో చెయ్యిపెట్టుకొన్నాను - పైసలు తగల్లేదు. రెండుపైసల బిళ్ళకూడ. అంతే-కనీసం ఐదుపైసలు. అదీ లభ్యంకాక బయటికొచ్చింది.

ముష్టిదాని కళ్ళు విప్పారాయి- అవధులుదాటిన ఆనందం - కృతజ్ఞత కళ్ళల్లో వ్యక్తంచేసింది. పదిపైసలు-పదిమంది దానంచేసే డబ్బు - దాదాపు పాతిక దణ్ణాలు బెడితే సమకూరే ఆస్తి ఒక గంటసేపు కాకిలా అరిస్తే తారులా అంటుకొంటే పోగయ్యేధనం-కృతజ్ఞతను వ్యక్తపరుస్తూ సత్తుగిన్నెను కళ్ళకు అద్దుకొంది.

రెండడుగులు ముందుకు కదిలాను. మళ్ళీ వెనక్కితిరిగి చూశాను. అది నావంక ఇంకా చూస్తోంది. మరొకసారి సత్తుగిన్నెకో కృతజ్ఞత చెప్పింది.

"అయ్యా దొరా ! అవిటివాణ్ని ... కాళ్ళులేవు దొరా ... ఈడి ముఖానకూడా ఒక పైసా పడెయ్యండి దణ్ణం బెడతా" నేను బిచ్చగత్తె గిన్నెలో పైసలు గిరాటెయ్యటం అది దణ్ణం బెట్టటం చూసి ఆశకలిగి ఆవతల పుట్‌పాత్ మీదనుండి అరుస్తున్నాడొక అవిటివాడు.

మేం నిర్లక్ష్యంగా ముందుకు నడవసాగాం డిగ్నిఫైడ్‌గా.

అంతలోనే మరో చిన్నచెయ్యి నాముందు కనిపించింది.

"సార్ ఒకపైసా...సార్" ఐదు సంవత్సరాల పిల్ల మా ప్రక్కనే పరుగెత్తసాగింది.

మా ప్రక్కగా దూసుకొంటూపోతున్న వాహనాల రొదలో కలిసి పోతోంది ఆ గొంతు పుట్‌పాత్‌మీద; మిరపకాయ బజ్జీలు వేయించుతోన్న బండి. బండివాడు జల్లిగంటెతో వాటిని దేవుతున్నాడు. వాటికోసం ఎదురు చూస్తూ ఒక గుంపు నాలుకలు పీక్కుంటూ గుటకలు మింగుతున్నారు.

ఒక ప్రక్క ఉలెన్ సూట్‌లో ఉన్న అతను.

మరో ప్రక్క పైసాకోసం వెంటాడుతున్న ఆ చిన్న చెయ్యి.

దారికడ్డంగా ఎవరో విద్యార్థి బజ్జీలు తింటూ ఆగుతూ ఆగుతూ నడుస్తున్నాడు. అతను విసిరివేసే ఎంగిలి బజ్జీ కోసమై ఆశతో అతన్నను సరిస్తూన్న గజికుక్క చెవులు వేలాడవేసుకొని, పొట్లంకేసిచూస్తూ అడ్డదిడ్డంగా నడుస్తోంది నా ప్రక్కన అమ్మాయిలా.

అతని భుజాలు పట్టుకొని ప్రక్కకు జరిపాను. మంటబుట్టినట్టు కొద్దిగా నోరుతెరచుకొని. కళ్ళలో నీళ్ళు తిరుగుతూంటే వెనక్కి తిరిగి చూశాడు.

"చూశారా! దీని తల్లికి పైసా ఇవ్వగానే దీన్ని మనమీదకు ఉసికొలిపింది. ఈ బిచ్చగాళ్ళను నమ్మకూడదు. అంతా పచ్చి మోసం - వెధవలు, మెత్తబడామంటే గోళ్ళూడగొట్టి వసూలు చేస్తారు. దీనికివ్వకండి. ముష్టివాళ్ళను ప్రోత్సహించకూడదు. మీ లాటివాళ్ళవల్లనే వీళ్ళు భారత దేశంలో ప్రబలిపోతున్నారు." చివరి రెండు వాక్యాలు ఇంగ్లిషులో కూశాడు.

"ఇది నిజంగా దాని కూతురే నంటారా?"

"ఆ మనిషి మీ అమ్మేనా" నే నా పిల్ల నడిగాను. అలా ముష్టివాళ్ళతో అనామకులతో మాటలు వృధాచెయ్యటం నాగరికుల లక్షణంకాదు, మరీ నడిబజారులో నే నలా మాట్లాడ్డం అతనికి విపరీతంగా కనిపించి నన్ను అదోలా చూశాడు.

"కాదు. ఆమె యేరే నేను యేరే" ఆ పిల్ల సమాధానం చెప్పింది. "భలేవారండీ మీరు. వాళ్ళు అలాగే అబద్ధాలు చెబుతారు. నిజం చెబితే డబ్బులు రాలవని వాళ్ళకుమాత్రం తెలియదా ఏమిటి?" అతనన్నాడు.

అవును సత్యం మనకు రుచించదు కాబట్టి అబద్ధమాడటం ఎంతో అవసరం.

అలారంగడియారంలా రొదచేస్తోంది ఆ పిల్లగొంతు.

నేను జేబులో చెయ్యిపెట్టాను: చిన్న నాణెం చేతికి తగిలింది. దాన్ని పైకి తీశాను. అది నే ననుకున్నట్లు నయాపైసా కాదు. పావలా బిళ్ళ.

అమ్మబాబోయ్-పావలా ... అడుక్కునేవాళ్ళకు పైసా ఇవ్వటం పరిపాటి, అదిలేకపోతే రెండు పైసలబిళ్ళ ఇవ్వటం పెద్ద ఔదార్యం ... మరి పావలా - ఇరవై ఐదు నయాపైసలు ఒక్కసారి రిచ్చివేయటం. ఇస్తే ఇవ్వవచ్చు...కానీ అలా డబ్బును విసిరిపుచ్చుకొని పారెయ్యటానికి కూడ అలవాటు కావాలి. నేను గుప్పిలి ముడుచుకొన్నాను.

నా ముఖంకేసి చూసి "బాబూ పైసా" అంటూ అతనివైపు తిరిగింది.

నా ముఖంపై చెళ్ళున కొట్టినట్లనిపించింది. దాని వయసు అయిదారు సంవత్సరాలయినా నా బలహీనత తేలిగ్గా పసిగట్టింది.

"ఇదిగో" పావలా దానిచేతిలో వేశాను.

"చూశారా ! ఈ బెగ్గర్స్ సంగతి నన్నడగండి చెబుతాను. వీళ్ళంత సైకాలజిస్టులు మరొక రుండ రనుకొండి - ముఖాలనుబట్టే ఎవడి దగ్గర డబ్బు రాల్తుందో ఇట్టే పసికడతారు ... నా దగ్గరమాత్రం ఆ పప్పులేం ఉడకవ్ ... ఏడుపు ముఖాలు, చింకిగుడ్డలు - అసహ్యం ... వాంతి వస్తుంది.."

"సరే... నాకు సెలవిప్పిస్తే!" అన్నాను ఆగి.

"ఎందుకు...మీరింటికి వెళ్ళటానికి అంత ఆతురతపడుతున్నారా.. మీ కభ్యంతరం లేకపోతే చల్లగాలికి అలా హుస్సేన్‌సాగర్ వరకూ వెళ్దాం" అని అర్థంవచ్చేలా ఇంగ్లీషులో పలికాడు.

నాతో అతనికివున్న ఆవశ్యకతను కళ్ళు వ్యక్తపరుస్తున్నాయి.నేను

రానని తల ఎగురవేస్తే ఎలానా అన్న ఆవేదనకూడ కళ్ళలో ప్రతిఫలించింది. కంఠంలోనుండి నా ప్రాతికూల్యం పెగిలి రాకముందే "ప్లీజ్..." పెదవులు ప్రక్కకు లాక్కున్నాడు పక్షవాతం వచ్చినట్లు. అది చిరునవ్వులా వినిపించింది.

"సరే ... ఒక గంటకాలం మాత్రమే మీకోసం వినియోగించగలను" నా మాటల్లో సుశిక్షితమైన ఆంగ్లభాషా సంస్కారం ఉట్టిపడింది. సిసలైన "బాస్" మాట్లాడే గాంభీర్యం వ్యక్తపరచగలిగినందుకు సంతృప్తిపడ్డాను.

అతని చేసైగతో "టాక్సీ" వచ్చింది ...డోర్ తీసి వినయంగా నన్నాహ్వానించాడు. నా తరువాత అతడు కూర్చున్నాడు. టాక్సీ కదిలింది.

"ఢిల్లీతో పోల్చిచూస్తే ఇక్కడ టాక్సీ ధరలు విపరీతం"...అతను ఢిల్లీకి తరచువెళ్ళే ప్రముఖవ్యక్తని. టాక్సీలలో తప్ప మామూలు వాహనాలలో తిరిగే బిక్కాఫకీరు తానుకానని ఇన్‌డైరెక్టుగా సూచించాడు. ఆ మాటకు నేను బోలెడు ఆశ్చర్యపోయి, అటువంటి ప్రముఖవ్యక్తితో నాకు పరిచయం లభించినందుకు అపరిమితానందంతో ఉబ్బితబ్బిబ్బయిపోతానని అతను ఆశించవచ్చు.

"కావచ్చు" వెలిగి ఆరిపోతున్న రంగుదీపాలబారును చూస్తూ పలికాను.

"మీ రెప్పుడైనా ఆగ్రా చూశారా" ఓహ్ ... తాజ్ బ్యూటీ ... మార్వెలస్ ... ప్రత్యేకంగా వెన్నెల రాత్రిళ్ళ,"

అతని అపార జీవితానుభవాలను శ్రోత గ్రహించాలి,

"బసీ"

ముందుచక్రం వంగి మెలికలు తిరిగిపోయింది - వెనకచక్రాల బలంతో దాన్ని గాలిలోకెత్తి పట్టుకొని. రిక్షాను ముందుకు తోసుకుపో

తున్నాడొక రిక్షావాడు. బోయినెట్ ఎత్తిపట్టుకొన్న డబుల్‌డెక్ ఒకటి మారణాస్త్రంలా గర్జించుకొంటూ ప్రక్కనేపోయింది. ఆ మేడమీద ఎర్ర దీపాలు ఒకదానివెంట మరొకటి తిరుగుతున్నాయి.

అతను నా నిర్లిప్తతను గ్రహించి మాట్లాడడం వాయిదా వేసికొన్నాడు. టాక్సీ హుస్సేన్ సాగర్ ఒడ్డున ఆగింది,

నిశ్చలంగా ఉన్న చెరువు-దూరాన ఎత్తయిన భవనాలు-దీపాలతో మెరుస్తున్నాయి. తారురోడ్డుపై నిర్విరామంగా జారిపోతున్నాయి కార్లు. మత్తు పూర్తిగా దిగిపోయింది. బెంచిపైన కూర్చున్నాం. చెరువు ఒడ్డున బారుగా నిర్మించిన ఇనుపకమ్ములు. వాటిపైకి వంగి నాకేసి చూసి అన్నాడు,

"ఇంత చిన్నవయస్సులో ఇలాటి ఉన్నత పదవికి రావటం చాలా అభినందించదగ్గ విషయం."

"థ్యాంక్యూ"

"ప్రమోషన్ కూడా త్వరగా వస్తుంది. అది పెద్ద కష్టమయిన విషయమేమీకాదు. మీగూర్చి ఓమాట చీఫ్ మినిష్టర్‌తో చెప్పమంటారా" అతని ముఖానికి సహజమైన ఆ పేలవమైన చిరునవ్వుతో అడిగాడు.

"నా ప్రమోషన్ గూర్చి నేను బాధపడడంలేదులేండి. ఆటోమెటిక్‌గా అదే వస్తుంది. మీ విషయాన్ని గూర్చి ముందు కానివ్వండి."

"మీ ముందున్న ఆఫీసర్ పెద్ద అనుభవశాలి ... అతనుండగా వెంటవెంటనే పనులైపోతూండేవి. ఎంత మర్యాద...అంత పెద్ద ఆఫీసర్ననే గర్వం ఏ కోశానాలేదు. ఎంతపేరు తెచ్చుకున్నాడు - మరచిపోతగ్గ వ్యక్తికాదు."

"అయితే మా ఆఫీసుకురావటం ఇదే పస్టుటైము కాదన్నమాట" అతను విచలితుడైనాడు. ప్రశాంతంగావున్న సాగర్ నీళ్ళలోకి ఏదో

దూకిన అలికిడయింది. నీళ్ళలోకి తొంగిచూశాడు; నింగిపైన చందమామ నీళ్ళలో ప్రతిబింబిస్తున్నాడు. ఆ స్థలంలో అలలు తళతళలాడుతున్నాయి.

"హవ్ ఆర్ యు ఫీలింగ్" ఇటుతిరిగి అడిగాడు. అప్రస్తుతమైన ప్రసంగం. తాగిననిషా నాలో మచ్చుకైగా లేదని అతనికీ తెలుసు కానీ అడిగాడు.

"ఓ. కె"

"వెరీగుడ్...మీకు క్రొత్త అంటున్నారుకదా, అందు కడుగుతున్నాను. కొందరు వాంతిచేసికోవటంకూడ జరుగుతుంది - తలదిమ్ముగా వుందా ? ఒళ్ళు తేలిపోతున్నట్లనిపిస్తుందా ?

"నో...నో"

అయితే మరి ఉక్కు శరీరం ... అందుకుసందేహంలేదు ... ఇది శరీరానికి పడిపోవాలేగాని మంచి కాంప్లెక్షన్ కూడ వస్తుంది. దీని వలన ఆరోగ్యం చెడిపోతుందనుకోవటం కేవలం పొరపాటు ... చుక్క లోపలబడితేసరి ఎక్కడలేని ఆకలి పుట్టుకొస్తుంది - ఏమంటారు ?"

"ఐ. సీ"

"పల్లీలు కావాలా సార్" ఆల్సేషన్ కుక్కలను చూసి భయపడ్డ వానిలా దూరంగా నిలబడి అడిగాడు కుర్రకుంక,

"నో...అక్కర్లేదు అతను సమాధానం చెప్పాడు పరాకుగా. రయ్‌రయ్‌మని దూసుకుపోతున్న చిన్నకార్లు. రెండు కళ్ళలాటిదీపాలు పొడవుగా వెలుగు జిమ్ముతూ. గాలినికోసుకొంటూ వెళ్ళిపోతున్నాయి. పరీక్షగా చూస్తూ అతని చూపులు వాటిని వెంబడించాయి రెండునిముషాలు. టైం చూసుకొన్నాడు నిట్టూరుస్తూ

"ఎవరికోసం చూస్తున్నారు ?"

"ఓహ్...అదా నా ఫ్రెండ్...ఇక్కడ కలవమని చెప్పాను'' సంబాళించుకుంటూ నాముందుకు వంగి పలికాడు.

టాక్సీ ఒకటి మాకు చేరువలో ఆగబోయింది. అతను నిటారుగా లేచి నిలబడ్డాడు. జేబులో చేతులు పెట్టుకొని. టాక్సీ ఆగేప్రయత్నం విరమించుకొని ముందుకు వెళ్ళిపోయింది. అతని భుజాలు వాలిపొయ్యాయి.

"నో. థ్యాంక్యూ. మీరు ఏర్పరచిన ఈ విందుకు కృతజ్ఞుణ్ని ... ఇక మరినాకు శెలవు...'' లాంచనప్రాయంగా ఆ కూతలు రెండూ ఇంగ్లీషులో కూసి కరచాలనంకోసం చేతిని ముందుకు చాపాను.

"నో మెన్షన్'' అంటూ చెయ్యి కలిపాడు.

"మన్నించాలి...మీ అమూల్యమైన కాలాన్ని నాకోసం వినియోగించినందుకు థాంక్స్. అటు వెళ్తున్నారెందుకు ...? బస్‌స్టాప్ వద్దకా? ఎందుకండీటాక్సీలో వెద్దురుగాని అగండి ... టాక్సీని పిలుస్తా'' అద్దె టాక్సీలకోసమై అతని కళ్ళు వెదకసాగాయి.

"అయితే రేపు మళ్ళీ ఆఫీసులో కలవమంటారా'' అత నడిగాడు చిన్నస్థాయిలో బ్రతిమాలుతున్న గొంతుతో.

"లేదు. అంత అవసరమేముంది? ... రేపు వెళ్ళగానే మీ ఫైలు చూస్తాను...నాకు వీలుపడినంత సహాయం నేను చేస్తానన్నానుగా'' నా కంఠంలో ధ్వనిస్తున్న నిర్లక్ష్యాన్ని అతను పసిగట్టాడు.

"మీరు'' అంటూ నీళ్ళు నమలసాగాడు. అడుగులో అడుగువేసుకొంటూ మునిసిపాలిటీ దీపానికి చేరువలోకి చేరాం - అతని ముఖంలో తీవ్ర అసంతృప్తి ఆవేదన కనిపించసాగాయి. బార్‌లో ఉన్న ఉత్సాహం ఎగిరిపోయింది.

"చెప్పండి'' ముందుకు కదిలాను;

"ఈ పని మీ స్వంత విషయమనుకొని శ్రద్ధచూపాలి ... లేకపోతే నేను ఆరిపోయినట్లే'' ప్రక్క-ప్రక్కనే ముష్టిదాని కూతురులా

నడుస్తూ మధ్యమధ్య నా మనోభావాలు గ్రహించేందుకై నా ముఖంకేసి తేరిపారచూడటానికై ప్రయత్నించసాగాడు, అతని చూపు నా పెదవులపై నిలచింది.

"చూస్తానన్నానుగా...ఇక బాధ ఎందుకు"

"చూస్తానంటే కాదు...మీరు తప్పక ఈ పని చేసిపెట్టాలి" నా కుడిచేతిని తన పురచేతులలోకి చొరవగా తీసికొన్నాడు.

"మీరు చాలా ముభావంగా వున్నారు...నావలన ఏదైనా పొరపాటు జరిగితే మన్నించండి " నానుండి దయను కోరుతున్న అతని చూపుల్లో దీనత్వం పరాకాష్ఠ నందుకొంది. ఆ బిచ్చగత్తె చూపులకన్నా అర్థావన్నంగా ఉన్నాయి.

"ఎందుకు నవ్వుతున్నారు?" అతను ప్రశ్నించాడు.

అతను నన్నుచూసి నిరర్థకంగా నవ్వాడు రెండు గంటలక్రితం. ఇప్పుడు కసితీర్చుకొనే అవకాశం దొరికింది. సంతృప్తిగా నవ్వుకొన్నాను. త్రాగుబోతు కనుపాపల్లో మెరుస్తున్న విద్యుద్దీపలకేసి చూస్తూ.

"ఏమిటీ...మిమ్ములను అంతగా నవ్వించే విషయ మేమిటి?"

"ఏమీ కాదు..."

ఏమిటో నాకు చెప్పకూడదూ? నేనుకూడ మీతో కలిసి నవ్వుతాను" అన్నాడు పెదవులపై చిరునవ్వు వెలిగించుకుంటూ. సాగర్‌నుండి లేచిన దోమలగుంపొకటి మమ్ములను చుట్టివేయసాగింది.

"ఇంతకుముందు మనంచూసిన ఆ బెగ్గర్ మెయిడ్ - దాని కూతురూ వాళ్ళు ఎంత మోసగాళ్ళు మీరు చెప్పినట్లు మనం బిచ్చగాళ్ళను ప్రోత్సహించకూడదు."

నేను నా మాటలు పూర్తిచెయ్యకముందే అతనిదృష్టి ప్రక్కకు మళ్ళింది. అద్దెటాక్సీ ఒకటి మాకు చేరువలోనే ఆగింది. వెల్డింగ్ జరుపవలసినచోట స్పార్క్ పుట్టినట్లు అకస్మాత్తుగా అతని ముఖంలో వెలుగు కనిపించింది.

సన్నని, నాజూకైన హైహీల్స్ వేసికొన్న పాదం బయటికొచ్చింది. అతను నన్ను విస్మరించి ఆ పాదంవైపు పరుగెత్తాడు ఆతురతతో.

పుత్తడిబొమ్మలా మెరిసిపోతూన్న అమ్మాయి సున్నితంగా టాక్సీ దిగింది. తల శుభ్రంగా దువ్వుకొని వెనక గుర్రపుతోకలా రిబ్బను కట్టుకొని వేలాడవేసింది. ముఖానికి పూసుకొన్న మెరుపులు వెన్నెలవెలుగులో చమక్-చమక్ మంటున్నాయి. పెదవులు నెత్తురు పూసుకొన్నట్లు ఎర్రగా మండిపోతున్నాయి. రంగురంగు పువ్వులతో ఆకర్షణీయంగావున్న గౌను. నున్నని గుండ్రని భుజాలు, మృదువుగావున్న ఆమె కుడిచేతిని ముందుకు చాపింది. అతను కరస్పర్శ చేశాడు.

వాళ్ళిద్దరూ నా వైపు నడిచారు.

ఎత్తుమడిమల జోళ్ళపై శరీరాన్ని వయ్యారంగా కదిలిస్తూ ముందుకు నడిచింది. పండిపగలబడిన యవ్వనం మనసుని విలవిలలాడించే తనూ సౌందర్యం.

"మిస్ జూలియస్...మైఫ్రెండ్"

నా గూర్చికూడ ఆమెకు పరిచయంచేశాడు, మృదువైన ఆమె చేతిని నా కందించింది. నాపట్ల వల్లమాలిన అభిమానాన్ని తొలిపరిచయం లోనే వ్యక్తపరిచింది. ఆమె పెదవులపై దరహాసం వెలిగింది. దాన్ని ఎనలైజ్ చేసుకోటానికి నాకు అట్టే వ్యవధి పట్టలేదు.

"ఆ బెంచిపైన కొద్దిసేపు విశ్రాంతి తీసుకొందాం" కీచుగొంతుతో ఆంగ్లభాషలో పలికింది. ఆమె అందించిన చేతిని విడిచిపెట్టకుండా ఆమెను బెంచివైపు మళ్ళించాను.

'టీ సదుపాయలు చూస్తానంటూ' ఆతను టీస్టాల్‌వైపు నడిచాడు ఆనందోద్వేగాలతో - మేమిద్దరమూ ఇంగ్లీషులో మాట్లాడుకోసాగాం.

"మీరు ఇందాక బార్‌లో ఎందుకు నావంక అలా చూశారు. నేను చాలా నొచ్చుకొన్నాను." ప్రేమగా నెక్ టైని స్పృశిస్తూ అడిగింది.

'అనాలోచితంగా అలా చూశాను, నిజానికి నీ అందం అలాంటిది. చూడకుండ ఉండలేకపొయ్యాను. నీ అపురూప సౌందర్యాన్ని అభినందిస్తున్నాను.'

అతను టీ తీసికొచ్చాడు. తేనీరు సేవించాక ముగ్గురమూ పిచ్చాపాటి మాట్లాడుకొన్నాం ఐదు నిమిషాలసేపు. ఆ తరువాత టాక్సీలో కూర్చున్నాం. టాక్సీ కదిలింది.

ఎత్తయిన మూడంతస్థుల భవనం. అసంఖ్యాకమైన కిటికీలు, దీర్ఘచతుర స్రాకారంగా తెల్లని వెలుగు జిమ్ముతున్నాయి, క్షుద్రమైన కీటకాలను ఆకర్షిస్తూ వెలిగిపోతున్నాయి విద్యుద్దీపాలు. మూడో అంతస్తుపైన అందమైన తోట. ఆ తోటలో ఒక మూలగా హోటల్ పేరు రంగుదీపాలతో అమర్చివుంది.

సౌఖ్యానికి పెట్టిపుట్టిన శ్రీమంతులు సుఖాన్ని ఖరీదు చేస్తుంటారిక్కడ.

టాక్సీ ఆగటంతోనే ముందు దిగాడు.

కాష్‌బాక్స్ వద్దకెళ్ళి మాట్లాడి డబ్బు చెల్లించాడు. అతనితో మరొక బాయ్ వెంటవచ్చాడు. బాయ్‌తో సహా మేమిద్దరమూ లిఫ్ట్‌లో పైకెళ్ళిపొయ్యాం, అతను క్రిందనే ఉండిపొయ్యాడు.

హోటల్ కుర్రవాడు రూమ్ తలుపు తెరచి లైటువేసి నిష్క్రమించాడు. సోఫాకమ్ బెడ్ ఒకటి ఉంది గదిమధ్యలో. డ్రెస్సింగ్ టేబిల్ ఆ మూల అమర్చారు-టేబిల్ మధ్యలో గుండ్రని వెడల్పయిన అద్దం-దాని ప్రక్కనే బట్టలస్టాండు — ఖాళీహేంగర్లు. ఈ మూలన చిన్న టీపాయ్, రేడియో.

వాష్‌బేసిన్ వద్దకెళ్ళి ముఖం చన్నీళ్ళతో కడిగాను. రేడియోవద్దకు నడిచి ట్యూన్ చేసింది. అసంఖ్యాకమైన పాశ్చాత్య వాయిద్యాలు లయబద్ధంగా సంగీతం వినిపిస్తున్నాయి. ఒక్కక్షణం అన్నీ ఆగిపోతున్నాయి. ఒక వాయిద్యం కనీసస్థాయికి దిగి కొన్ని సౌంజ్ఞలు చేస్తోంది. ఆ పిమ్మట

అన్ని వాయిద్యాలూ ఒక్కుమ్మడి శివం పెరిగినట్లు మ్రోగుతున్నాయి. అలవాటున్న వాళ్ళకు శ్రావ్యమైన పాశ్చాత్య సంగీతం అది. అలవాటు లేనివాళ్ళకు, ఖాళీడబ్బాల్లో గులకరాళ్ళు పోసి మ్రోగించినట్లుంటుంది.

డ్రెసింగ్ టేబిల్ వద్దకెళ్ళి మరొకసారి పెదవులు ఎరుపుజేసుకుంది. పఫ్‌తో బుగ్గలు అద్దుకొంది. నాకు చేరువగా వచ్చింది.

శరీరం పట్టుతప్పిపోసాగింది నాకు. పొంగులు వారుతున్న కామేచ్ఛతో నరాలు ప్రకోపించాయి. నున్నని భుజాలు నిమిరి గట్టిగా పైకి లాక్కున్నాను.

ఆకస్మిక ఉద్రేకాన్ని సహించలేనట్లు 'సోరూడ్' అంటూ చేతులు విసిరికొట్టింది. అవమానంతో శరీరం దహించుకుపోయి అలానే నిలబడి పొయ్యాను. నా కన్నుల్లో భావాన్ని గ్రహించి మళ్ళీ దగ్గరకొచ్చింది లాలనగా.

"సున్నితంగా చూడు" నా ఎడమచేతిని తన సన్నని నడుంకు చుట్టుకొని చెయ్యితో చెయ్యి కలిపి ఆ సంగీతానికి అనుగుణ్యంగా అడుగులు వెయ్యసాగింది. అలా అడుగులు వెయ్యటంలో నాకంత పరిపూర్ణత లేదు. అది అనాగరికతకు చిహ్నం. నాగరీకమైన ఆ స్త్రీ సాన్నిధ్యంలో ఆ లోపాన్ని వ్యక్తపరచకూడదు. వెంటనే పట్టు వదలించుకొని సోఫాలో కూలబడ్డాను.

"నాతో అంత సిగ్గుగా వుందా" గలగలమని నవ్వింది. రేడియో గొంతు నొక్కింది. ప్రశాంతత నెలకొన్నది.

టేబిల్ వద్దకెళ్ళి ఒక సీసాకు కార్కు తీసి రెండు గ్లాసులలోకి వంచింది. సోడా కలిపి పట్టుకొచ్చింది. ఒకటి నాచేతితో పెట్టి మరొకటి తను సోఫా చివర కూర్చొని త్రాగనారంభించింది. గ్లాసు ప్రక్కన బెట్టాను. విజృంభిస్తూన్న మనసును అదుపులోకి తెచ్చుకోటానికి ప్రయత్నం చేయసాగాను.

తనగ్లాసు కాళీచేసి అక్కడబెట్టి నా చేతిలోకి తీసుకొంది. నాకు

అత్యంత సమీపంగా జరిగి నా భుజాలుపట్టుకొని తనపైకి వాల్చుకొని, గ్లాసు పెదవులకు తాకించి, నిషాలో ముంచసాగింది. తరువాత ఇంకో గ్లాసు - ఇంకొకటి.

గొంతులోనుండిదిగి ప్రేవుల్లోకి జారినంతసేపు చేదుగా, కుంకుడు పులుసులా పొగలు గక్కుతూ లోనికెళ్ళింది, ముందు సేవించిన దాని కన్నా ఘాటుగా వుంది.

కీళ్ళలో పటుత్వం తగ్గిపోయి శరీరమంతా చల్లబడిపోయింది. స్పర్శావిహీనమై మొద్దుబారిపోయింది. తల దిమ్మెక్కి కళ్ళు వాలిపోనారంభించాయి. ఆ అమ్మాయి ముఖం అస్పష్టంగా కనిపించసాగింది..

నీరసంగా తేలుతున్న కాళ్ళను ఎత్తి సోఫామీదపెట్టి బారుకు చాపుకొన్నాను. ఆమె మెల్లగా నా తలను సోఫాపై వాల్చింది. నా ఛాతి నిమురుతూ, నా ముఖంపైకి వంగి సున్నితంగా నా నుదురు ముద్దు పెట్టుకొంది.

"స్విచ్ ఆఫ్‌చేసిరానా" ఆమె అడిగింది.

అంగీకారంగా తలవూపాను.

"రేపు నేనుకూడ మీ ఆఫీసుకు వస్తున్నాను" జుత్తులోకి వేళ్ళు పోనిస్తూ అడిగింది.

"ఎందుకు"

'మిస్టర్ రావ్' వ్యవహారంగూర్చి...అతను మూడురోజులనుండి ప్రాధేయపడి అడుగుతుంటే ఆ పని చెయ్యకూడదూ."

"అలానే...నీవిటు...ఇటు ప్రక్కకు తిరుగు"

"ఆహా...ముందు నాకీవిషయం చెప్పండి" ఆమె పైకిసాగుతూన్న నా చేతివేళ్ళను ముడుస్తూ దూరంగా జరిగింది.

"అది నా ఒక్కడితో సాధ్యమయ్యే పనికాదు ... దానికి పెద్ద తతంగం వుంది..."

"ముందు మీవలన కావలసిన పనిచెయ్యండి ... తరువాత వ్యవహార మేదో అతను చూసుకొంటాడు."

"వాళ్ళు తయారుచేసే వస్తువులనే ప్రభుత్వ సంస్థలు కొనాలని ఆథరైజ్ చెయ్యటం మాకు సంబంధించిన విషయంకాదు – ఆ పని మంత్రుల స్థాయిలోకాని జరగదు–మే మెంతవరకూ అంటే ఆ వస్తువులు క్వాలిటీ మంచిదని ధృవపరచడం మాత్రమే ... కాబట్టి ముందు మంత్రి గారిని కలిసికొమ్మని చెప్పు"

"అవన్నీ ఆలోచించుకోకుండానే మీదగ్గర కొస్తారా" బిగ్గరగా నవ్వింది–సోఫామీదనుండి లేచి కూర్చొని.

"మంత్రిగారితో ఈ విషయం అంత సులభంగా తేల్చుకోలేడు"

'మెడియర్ ఫెలో' నెక్టైపై చేతితో నిమిరింది. "ఈలాటి కీలకమైన ఉద్యోగాలకు సరిపొయ్యే వయస్సు కాదు నీది" ప్రేమగా నా బుగ్గలు స్పృశించింది.

ఎందుక్కాదు ?

'నిస్సందేహంగా కాదు_అంతే'

"ఎందుకలా మాట్లాడుతున్నావ్"

'ఎందుకా ? నీ అమాయకత్వానికి...మినిష్టర్స్‌కానీ...యం. పి.లు కానీ యం. ఎల్. ఏ లు కాని ఒక్కొక్క ఎలక్షన్‌కు ఎన్ని లక్షలు ఖర్చు పెట్టి గెలుస్తున్నారో తెలుసుగా!...మళ్ళీ ఈ డబ్బంతా ఎలా తిరిగి సంపాదించుకొంటారు ? ఎవరిదగ్గర నుండి ?'

తుళ్ళిపడింది తాగిన శరీరం. సమాధానం వెతుక్కోసాగింది బుద్ధి చీకటిలో. ఆ మాటలు పలుకుతూన్న స్త్రీమూర్తి నీలంరంగు కనుపాపల లోతుల్ని చూడలేకపొయ్యాయి కళ్ళు – ఆకారాన్ని పోల్చుకోటానికి పెనుగులాడింది మనస్సు. టేబిల్‌పై నిర్విరామంగా తిరిగినపంకా నీరసించి ఆగిపోయింది. గదిలో గాలి స్థంభించింది. వదిలిన ఊపిరినే మళ్ళీ పీల్చుకోసాగాయి ఊపిరి తిత్తులు.

గొంతు బిగించివేయసాగింది మెడకు వేసికొన్న ఉచ్చు – గుడ్డ పీలిక నాగరికమై పై. ఒళ్ళు కంపరమెత్తించసాగాయి. ఉలెన్‌కోటు – పంట్లాం – గాలి వెలుతురూ చొరరాకుండ మూసిన కిటికీలు.

'బట్టలెందుకు తీసివేస్తున్నారు...ఉంచుకోండి కొన్ని నిమిషాల్లో ఎలక్ట్రిసిటీ వస్తుంది'...స్టాండ్‌కేసి విసిరిన కోటు తగిలి ఆ అమ్మాయి కంఠం హెచ్చరించింది.

'అవసరంలేదు ... పొద్దున పదిగంటలనుండి ప్రాణాలు తోడుతున్నాయ్...అహ హ!...ఎంత హాయిగా వుంది...ఆ కిటికీలు రెండూ తెరిచెయ్యి. తెరువు'

కిటికి తలుపులు తొలగిపొయ్యాయి. పరదాలు ప్రక్కకు జరిగాయి. పరదాల అవతల దీపాలు ఆరిపోయిన నగరం. గుట్టలు గుట్టలుగా పడివున్న భవనాలు మొహంజదారో, హరప్ప శిధిలాల్లా చెదురుమదురుగా లీలగా కనుపిస్తున్నాయి. కునుకుతూన్న రోడ్లను విసిగిస్తూ అక్కడక్కడ చిన్నకార్లు తిరుగుతున్నాయి. టి. బి. రోగిలా, ఆకాశంలో క్షీణిస్తూన్న చందమామ. ఎర్ర పచ్చ దీపాలతో విమాన మొకటి చంద్రుడికేసి పోతుంది. పన్నెండు కావచ్చినా విసుగు విరామంలేని గాలి నగరపు కుళ్ళునంతటినీ మోసుకొచ్చి ఆ భవనంలో చొరబడసాగింది. కిటికీ మూశాను.

"ఏమిటి అలా చూస్తున్నావు?"

"ఏమిలేదు. రేపు సర్టిఫై చెయ్యటానికి సంకల్పించుకొన్నాను."

'రియల్లీ' పట్టలేని ఆనందం ఆమె కంఠంలో ప్రతిధ్వనించింది. ఆమె బాహువులు అచంచలంగా ఉన్న నా శరీరాన్ని చుట్టివేసి గట్టిగా హత్తుకొన్నాయి. నా మెడ ముందుకు వంచుకొని చెంపపై ముద్దు పెట్టుకొంది. మంగలి తలతిప్పినట్లు ఇటుతిప్పి ఇంకొకటి రెండోవైపు సున్నితంగా చిత్రించింది. సన్నగావున్న బరువైన లెదర్ పర్సునొకటి చేతిలో పెట్టింది-షేక్‌హాండ్ ఇస్తూన్నట్లు చెయ్యికలిపి.

'ఏమిటిది ?'

'ఉంచు'. నాచేతి గుప్పిలిని బలవంతంగా ముడిచాయి ఆమె చేతులు. జిప్ లాగాను, కట్టలు నోట్లకట్టలు - చేతికి తగిలాయి. నిప్పులో చెయ్యిపెట్టినట్లు చివ్వున వెనక్కిపోయింది చెయ్యి. ప్లాస్టిక్ పొరలా కళ్ళపై వేలాడుతున్న మైకం జారిపోయింది. ఒక్కక్షణం శరీరం కంపించి ఆగిపోయింది.

పైన పంకా మళ్ళీ తిరుగసాగింది.

"స్విచ్...ఆన్...ప్లీజ్"

తెల్లని వెలుగు, ప్రవాహంలా గదిని ఆకట్టుకొంది. తన కళ్ళు పర్సుపై కేంద్రీకరించాయి. ముఖంలో చిరునవ్వులు, లాలింపు మాటలు మాయమయ్యాయి.

ఆమె చూపులు పర్స్...పర్స్...పర్స్...పైపై ట్రేటర్‌లా పర్సుకు తగిలి ప్రక్కకు ఉరికాయి. తనతో మాట్లాడాలనే ఉత్కంఠ గొంతులోనే ఆగిపోయింది నాకు.

కళ్ళు దించేసుకొని 'నేవెళ్తా' అంది - జాతీయగీతం ఆలపించక ముందే వెళ్ళిపోటానికి త్వరపడే ప్రేక్షకునిలా,